క్లుప్తంగా

రంజాన్ ప్రార్థన ఏర్పాట్ల పరిశీలన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గ పరిధిలో శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొనని ముస్లింలు నిర్వహించుకునే ప్రత్యేక ప్రార్థనలకు అనువైన ప్రదేశాలను స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్థానిక కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, మహాదేవు అప్పాజీరావు తదితరులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా స్థలాల్లో శనివారం నిర్వహించే ప్రార్థనలకు అనుకూలంగా ఉంచాలని అధికారులకు సూచించారు. శుభ్రపరచటమే కాకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ప్రార్థన స్థలాల్లో కూలర్స్ కూడా పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ అల్లా ఆశీస్సులు రాష్ట్ర ప్రజలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై ఉండాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



భవానీపురం(విజయవాడపశ్చిమ):మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పర్వదినం రోజున అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకుడు రాచమళ్ల సుధాకర్ (సబ్బుల్స్) ఆధ్వర్యంలో విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ నరేంద్ర రాఘవ మాట్లాడుతూ చీరలు పంపిణీ చేసిన సుధాకర్ అభినందనీయులన్నారు. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం నగర అధ్యక్షుడు పోతిరెడ్డి సుబ్బారెడ్డి, నగర అధికార ప్రతినిధి ఏలూరు వెంకన్న, నగర కార్యదర్శి బొమ్ము మధు, పార్టీ నాయకులు ఎస్ఎంఎస్ బషీర్, రుద్రశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేలు విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ. 50 వేలు విరాళాన్ని అందచేశారు. విజయవాడ ఏపీసీపీడీసీఎల్ ఛీఫ్ జనరల్ మేనేజర్ డి. సుబ్బారావు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ. 50 వేల విరాళాన్ని అందచేశారు. దాతకు ఆలయ మర్యాదలతో దర్శనం కల్పించారు.

రంజాన్‌కు ప్రత్యేకం సేమియా

వన్‌టౌన్‌లో పలు సేమ్యా తయారీ కేంద్రాలు



విజయవాడ వన్‌టౌన్‌లో సేమ్యాలు విక్రయిస్తున్న దుకాణదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పర్వదినం అనగానే అందరికీ గుర్తుకు వచ్చే తీపి వంటకం షీర్‌ఖుర్మా. రంజాన్ పర్వదినం రోజున ప్రతి ముస్లిం ఇంట సేమియాతో చేసే ఈ వంటకం తప్పనిసరి. పండుగ రోజున ముస్లింలు తమ ఆత్మీయులకు, బంధువులకు, స్నేహితులకు సేమియాతో చేసిన షీర్‌ఖుర్మాను అందజేస్తారు. అంతేకాకుండా తమ దగ్గర ఆత్మీయులకు రంజాన్ సందర్భంగా సేమియాను అందజేసి తమ ఆనందాన్ని పంచుకుంటారు. అందుకోసం పండుగ సమీపిస్తున్న వారం పది రోజులు ముందుగానే సేమియా తయారీకు సన్నద్ధమవుతుంటారు. అందులో భాగంగానే ఒక్కొక్క ముస్లిం ఇంట కనీసం ఐదు నుంచి పది కిలోల మేర సేమియాను తయారు చేయిస్తుంటారు.

వన్‌టౌన్‌లో సేమ్యా తయారీ కేంద్రాలు....

వన్‌టౌన్‌లోని సేమియా తయారీ కేంద్రాలు ఏడెనిమిది వరకూ ఉన్నాయి. రంజాన్ మాసంలో ఆ సేమియా తయారీ కేంద్రాలన్నీ ఉదయం నుంచి రాత్రి వరకూ బిజీబిజీగా దర్శనమిస్తుంటాయి. కొంతమంది ఇళ్ల వద్ద సేమియా తయారీ యంత్రాలు కూడా ఉండటంతో వారే స్వయంగా తయారు చేస్తుంటారు. ముస్లింలు గోధుమలను శుభ్రం చేసి పిండి ఆడించి సిద్ధం చేసుకుంటారు. తిరిగి దానిని శుభ్రపరచి సేమియా తయారీ కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ తయారీ చేసే సిబ్బంది ఆ పిండిని యంత్రంలో వేసి సేమియాను తీస్తారు. తరువాత తయారైన సేమియాను ఆరుబయట గాలి ఆడే విధంగా ఆరబెడతారు.

ఇది చూడటానికి చాలా ఆసక్తిగా ఉంటుంది. బయట రకరకాల సేమియాలు విభిన్న రుచుల్లో అందుబాటులో ఉన్నా వాటిని తీసుకోవడానికి ఇష్టపడరు. చాలా కొద్దిమంది మాత్రమే అటుగా అడుగులు వేస్తారు. అయితే చాలా మంది ముస్లింలు ఇలా స్వయంగా సేమియాను తయారు చేయించుకొని వినియోగిస్తారు. వన్‌టౌన్‌లో ముస్లింలు తమకు ఆత్మీయులైన హిందువులకు తప్పనిసరిగా ఈ వంటకాన్ని అందజేయడం అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం. మతసామరస్యానికి ఇటువంటి ఆత్మీయ పలకరింపులు వారి మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందంటారు ఇక్కడి స్థానిక నివాసితులు.

ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



ఈద్గాలో నమాజుల కోసం చేస్తున్న ఏర్పాట్లు



వన్‌టౌన్ గాంధీజీ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేసిన దృశ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కఠోర దీక్షలకు ఇక సెలవు. దాదాపు నెల రోజుల పాటు ఉపవాసదీక్షలు చేసి ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. దేశంలోని మత పెద్దలు శనివారం రంజాన్ పర్వదినం జరుపుకోవాలని నిర్ణయించినట్లు స్థానిక మసీదులలోని ఇమామ్‌లు చెప్పారు. ఈ మేరకు నగరంలోని అన్ని మసీదుల్లో ఏర్పాట్లు చేశారు. విజయవాడతో సహా ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈద్గాలు, మసీదుల వద్ద పందిళ్లు, ఇతర మంచినీటి సదుపాయాలను కల్పించి రంజాన్ నమాజ్‌లకు ఆయా నిర్వాహకులు సన్నద్ధం చేశారు. రంజాన్ పండుగను ప్రకటించగానే చాంద్ ముబారక్ అంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. విజయవాడలో పలు ప్రాంగణాల్లో ప్రత్యేక ప్రార్థజిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈద్ రోజున అందరూ ఉదయాన్నే ఈద్గాకు వెళ్లి సామూహికంగా నమాజులు చదువుతారు. ఇస్లాం మతం నియమాల ప్రకారం 30 రోజులు ఉపవాసాలు పూర్తయ్యాయి. 30 ఉపవాసానికి పండుగ వచ్చింది. ఈ ఏడాది ఐదు శుక్రవారాలు రావటంపై ముస్లింలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉపవాసదీక్షలు శుక్రవారంతో ముగియటం మరింత సంతోషాన్ని కలిగించిందని ముస్లింలు చెబుతున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం నుంచి వన్‌టౌన్‌లో సందడి నెలకొంది. అన్ని మసీదులు విద్యుత్‌కాంతులతో కళకళలాడుతున్నాయి. శనివారం పండుగను జరుపుకోవడానికి ముస్లిం కుటుంబాలు సమాయత్తమయ్యాయి. వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేయడానికి బారులు తీరారు. చెప్పుల దుకాణాలు సైతం కళకళలాడాయి. గాజులు, ఇతర ఫ్యాన్సీ సరుకులను విక్రయించే దుకాణాలతో పాటుగా అత్తరు, వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతూ కనిపించాయి. వాటితో పాటుగా పంజా సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకూ ఉన్న వివిధ హలీమ్ సెంటర్లు రద్దీగా దర్శనమిచ్చాయి. ముస్లిం సంప్రదాయాలకు అవసరమైన టోపీలు, బురఖాల విక్రయించే దుకాణాలు సందడిగా మారాయి. ఇస్లాంపేట, వించిపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని దుకాణాలన్నీ కళకళలాడుతూ దర్శనమిచ్చాయి.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):రంజాన్ (ఈద్)ను పురస్కరించుకుని శనివారం ఉదయం 10 గంటలకే చిట్టినగర్ ఈద్గాలలో ప్రత్యేక నమాజు ప్రారంభమవుతుందని మోతీ మసీదు ఇమామ్ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. 120 ఏళ్ల చరిత్ర కలిగిన చిట్టినగర్ ఈద్గాలో సామూహిక నమాజులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రత్యేక ప్రార్థనలకు విచ్చేసే వారు ఉదయం 9–30 గంటల కల్లా గ్రౌండ్‌కు చేరుకోవాలన్నారు. ఈద్గాలో ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా పేర్కొన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో షామియానాలతో పాటు కూలర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు.

ఇద్దరు రౌడీషీటర్ల నగర బహిష్కరణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ప్రజల శాంతిభద్రతలకు, సామాన్య ప్రజల జీవనానికి విఘాతం కలిగిస్తున్న ఇద్దరు రౌడీషీటర్లను నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా నగర బహిష్కరణ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు షేక్ కరీముల్లా, అరిపిల్లి వెంకటేష్ అలియాస్ బొజ్జాలు పలు నేరాలకు సంబంధించి అరెస్టై కొన్ని రోజుల క్రితం జైలు నుంచి బయటకు వచ్చారు.

అయినా కూడా వారి నేర ప్రవృత్తిని మార్చుకోకుండా ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సేవించి అల్లర్లకు పాల్పడి సమాజంలో అలజడి సృష్టిస్తుండడంతో వారిద్దరినీ నగరం నుంచి బహిష్కరించారు. ఇలా ఇప్పటివరకూ నగరంలో 18 మందిని ఇదే విధంగా బహిష్కరించినట్లు సీపీ తెలిపారు. నగరంలో ఇంకా చెడునడత కలిగిన వ్యక్తులపై ఇప్పటికే పటిష్టమైన నిఘా ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఇటువంటి విధానాలను ఎవరైనా అనుసరిస్తున్నట్లు తెలిస్తే వారిపై చట్టరీత్యా మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓంకారం బోర్డుకు మరమ్మతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గగుడి ఘాట్ రోడ్డులోని ఓం టర్నింగ్ కొండ ప్రాంతంలో దేవస్థానం ఏర్పాటు చేసిన విద్యుత్ బోర్డుకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో ఎక్కడ నుంచి చూసినా ఇంద్రకీలాద్రిపై విద్యుత్ దీపకాంతులతో ఓం కారం కనిపిస్తుంది. విద్యుత్ లైట్లను కోతులు ధ్వంసం చేయడంతో వాటికి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని దేవస్థాన అధికారులు నిర్ణయించారు. ఐదు రోజుల పాటు పనులు జరుగుతాయని, భక్తులు గమనించి దేవస్థాన అధికారులతో సహకరించాలని కోరారు.

కేంద్రం తీరుపై నిరసన

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశ్ కి బచావో మోడీకి హటావో నినాదంతో బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ, మతోన్మాద విధానాలపై సీపీఐ–సీపీఎం ఆధ్వర్యాన శుక్రవారం మధురానగర్‌లో శుక్రవారం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ర్యాలీ చేశారు.

విద్యారంగ వికాసానికి ప్రభుత్వం కృషి

మంత్రి జోగి రమేష్



నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో విద్యారంగ వికాసానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల 58వ వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జోగి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన తదితర అనేక పథకాలతో ప్రభుత్వ విద్యా సంస్థలను నేటి అవసరాలకు దీటుగా అధునాతన సౌకర్యాలతో తీర్చి దిద్దుతున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికీ ఉపాధి అవకాశాలు అందించే దిశగా నాణ్యత ప్రమాణాలు పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. కేబీఎస్ కళాశాల 58 సంవత్సరాల ప్రస్థానం విజయవంతంగా కొనసాగించటం ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. కళాశాల పాలకవర్గ పెద్దలను అభినందిస్తున్నట్లు చెప్పారు. కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రామిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో కేబీఎస్ కళాశాలకు అత్యధిక గుర్తింపు ఉందన్నారు. ముఖ్యంగా అన్ని రంగాల్లోనూ కేబీఎస్ కళాశాల మంచి రాణింపును సాధిస్తుందన్నారు. విద్యా ప్రమాణాలను మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు టి. శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ఆవిష్కరణలను గమనంలో ఉంచుకొని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. పారిశ్రామికవేత్త మద్ది రమేష్ తదితరులు ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. కళాశాల సహాయ కార్యదర్శి జీవీ రామారావు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వర్మి కంపోస్ట్ యూనిట్ పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని కబేళా ఆవరణలోగల వర్మి కంపోస్ట్ యూనిట్‌ను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. నగరంలో లభ్యమయ్యే తడి వ్యర్థ పదార్థాలను సేకరించి వర్మి కంపోస్ట్ యూనిట్‌లో వానపాముల ద్వారా సేంద్రీయ ఎరువుగా మార్చే కంపోస్టింగ్ విధానాన్ని ఆయన పర్యవేక్షించారు. ప్లాంట్‌లో ఎంత కంపోస్ట్ ఉత్పత్తి అవుతున్నదన్నది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం డివిజన్‌లోని వంగవీటి మోహన రంగా జంక్షన్, కబేళా, మిల్క్‌కాలనీ, అంబేడ్కర్ రోడ్ ప్రాంతాల్లోని పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ విధానంతోపాటు డ్రైయిన్స్‌లో పూడిక తొలగించే పనులు పర్యవేక్షించారు. సర్కిల్–1 జోనల్ కమిషనర్ ఎ రాంబాబు, ఏడీహెచ్ శ్రీనివాసు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కొత్త మందుల తయారీపై సదస్సు



సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఆర్ నాగరాజు, పక్కన సునీత, రమణ

లబ్బీపేట(విజయవాడతూర్పు):మానవాళి జీవన ప్రమాణాలు పెంచేందుకు కొత్త మందుల తయారీ విధానాలు, వాటి ఆవశ్యకతను తెలియచేసేందుకు నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించే అవగాహన సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఆ కళాశాల ఫార్మస్యూటిక్స్ అండ్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ ట్రెండ్స్ ఆఫ్ ట్రాన్స్‌రేషనల్ రీసెర్చ్ ఆఫ్ న్యాచురల్ ప్రొడక్ట్స్ అనే అంశంపై అధ్యాపకులకు అవగాహన కలిగించనున్నారు. ఈ సదస్సులో వారం రోజుల పాటు వివిధ యూనివర్సిటీల నిపుణులు అవగాహనా సదస్సులు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవంలో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీకి చెందిన ఫార్మస్యూటిక్స్ విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకృతిలో లభ్యమయ్యే వాటి నుంచి వ్యాధి నివారణలో మెరుగైన ఫలితాలు, దుష్ప్రభాలను నివారించడంలో నూతన మందుల తయారీ విధానాల గురించి అధ్యాపకులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, ఫార్మస్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.రమణ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ):మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీపై గొల్లపూడిలోని డాక్టర్ అంబేడ్కర్ విద్య అకాడమీ హైస్కూల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, విజయవాడ దిశ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజ్వల రాష్ట్ర సీనియర్ కో ఆర్డినేటర్ వై. చంద్రయ్య మాట్లాడారు. తమ సంస్థ గత 26 సంవత్సరాల నుంచి మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ నేతృత్వంలో పోరాడుతున్నామని తెలిపారు. పోలీస్, జ్యుడిషియల్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో ఇప్పటి వరకు 26500 మంది మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించామన్నారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకి సంబంధించిన బాధితుల కథనాలను డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు. పాఠశాల, కళాశాలల బాలికలు ప్రేమ, సినిమా అవకాశాలు, మోడలింగ్, వివాహం, విద్య, ఉద్యోగాల అవకాశాలు, గల్ఫ్‌లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు, ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కి గురి అవుతున్నారని వివరించారు. ప్రజ్వల అసిస్టెంట్ కో ఆర్డినేటర్స్ చెన్నయ్య, దేవ కరుణ, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు ప్రేమలత, సుబ్బారావు, పోలీస్ కానిస్టేబుల్స్ వెంకటేష్, శ్యామ్, శివప్రసాద్, హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, హెచ్ఎమ్ దేవిడ్ రాజు టీచర్స్ పాల్గొన్నారు.

నూరుశాతం బాస్కెట్ కలెక్షన్ తప్పనిసరి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో ప్రథమ ర్యాంక్ సాధించేందుకు తీసుకోవాల్సిన ఆధునిక పారిశుద్ధ్య విధానాల అమలుపై తీసుకోవాల్సిన చర్యలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, లీడ్ వర్కర్స్‌కు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నూరు శాతం బాస్కెట్ కలెక్షన్ జరగాలన్నారు. వివిధ డివిజన్లలోని ప్రతి వీధిలోగల రోడ్ల మార్జిన్స్‌లో పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఇందు కోసం కనీసం నెలకు రెండు సార్లు అన్ని వీధులు కవర్ అయ్యేలా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. డ్రైయిన్లలోని మురుగునీటి పారుదలలో చెత్తచెదారం అడ్డు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఏపీ ట్రాన్స్‌కోవారుగానీ, ప్రజలుగానీ కట్ చేసిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత భద్రత పరికరాలు (చెప్పులు, రేడియం జాకెట్స్, గ్లౌజులు) ఉండేటట్లు చూడాలన్నారు. నగరంలో ఉండే సీటీ/పీటీ, యూరినల్స్ నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో తీసిన పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఏసీజీ కె.సత్యవతి, సీఎమ్‌ఓహెచ్ డాక్టర్ పి.రత్నావళి, ఏఎమ్‌ఓహెచ్‌లు, శానిటరీ సూపర్‌వైజర్లు, వెహికల్ డిపో ఈఈ, డిఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజాన్‌లకు సత్కారం



ఇమామ్, మౌజాన్‌లను సత్కరిస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):సృష్టిలోని ప్రతి మానవుడు సుఖసంతోషాలతో గడపాలనేది రంజాన్ సారాంశమని ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వించిపేట షాహీ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ఇమామ్, మౌజాన్‌లను, సేవలందిస్తున్న కార్యదర్శి ఇంతియాజ్‌ను శుక్రవారం ఆసిఫ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆకలితో ఉండకూడదని, అలాగే పండుగను అందరూ జరుపుకోవాలని రంజాన్ చెబుతుందన్నారు. రంజాన్ మాసంలో కఠోరదీక్షతో చేసే ఉపవాసాలు మనస్సును అదుపులో ఉంచటమే కాకుండా ఏడాది మొత్తం అదే తరహా జీవితాన్ని కొనసాగించేందుకు ఉపకరిస్తుందన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత వైఎస్ రాజశేఖర రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్ స్ఫూర్తిని ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తూ ముస్లింలకు అండగా ఉన్నారన్నారు. రంజాన్ మాసం ఎంతో సందేశాత్మకమైన పర్వదినమన్నారు. రంజాన్ మాసం చాలా మంచి ఫలితాన్ని అందిస్తుందన్నారు.

అవ్వాతాతలకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):అంధత్వ నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత కంటి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మూడవ విడత కంటి పరీక్షలను నిర్వహించారు. స్థానిక ఊర్మిళా సుబ్బారావునగర్‌లోని వార్డ్ సచివాలయంలో చేపట్టిన ఈ కంటి వైద్య శిబిరానికి పలువురు అవ్వాతాతలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి శుక్లాలు ఉంటే ఉచితంగా ఐఓఎల్ ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. అలాగే డయాబెటిక్ వ్యాధిగ్రస్తులకు నీటికాసులు (గ్లకోమా) వంటివాటికి ఉచితంగా ఆధునిక కంటి వైద్యం అందిస్తారని చెప్పారు. ఇంటింటా కంటి వెలుగులు ప్రసరించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ వైవీ దుర్గాప్రసాద్, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు మజ్జిగ ప్యాకెట్లు అందజేత



విజయవాడ స్టేషన్‌లో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్‌లు పంపిణీ చేస్తున్న జయమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జయ మోహన్ మాట్లాడుతూ వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా రైలు ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆర్గనైజేషన్ సభ్యులతో కలసి 1500 మజ్జిగ ప్యాకెట్‌ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. వేసవి ముగిసే వరకు తరచూ ఇటువంటి కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో రైల్వే ఉద్యోగులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ డైరెక్టర్ పీబీఎస్ ప్రసాద్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, టిక్కెట్ చెక్కింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీళ్లు పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): తుమ్మలపల్లి కళాక్షేత్రం వెనుక భాగాన ఉన్న వీరబాబు స్వామి దేవస్థానంలో శుక్రవారం జల ప్రసాదం/చల్లని తాగు నీరు పంపిణీ చేశారు. దేవస్థానం కమిటీ ఆహ్వానం మేరకు వీరబాబు గుడికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ బాలి గోవిందు విచ్చేసి జల ప్రసాదాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే ప్రయాణికులు, పాదచారులకు స్వామివారి తరుపున చల్లని మంచినీరు అందిస్తున్న కమిటీ సభ్యులు అభినందనీయులన్నారు. విజయవాడకు చెందిన దాత పల్లపోతు వెంకట శ్రీనివాసరావు 169 గ్రాముల వెండి చెంబును వీరబాబు స్వామి దేస్థానానికి బహూకరించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు కొమ్మూరు బసవరాజు, సెక్రటరీ రవి, కోశాధికారి కొప్పరపు వీరబాబు, సభ్యులు గొంట్ల రామమోహన్‌రావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.